క్లుప్తంగా

వికలాంగులకు పెన్షన్ రూ. పది వేలకు పెంచాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వికలాంగులకు పెన్షన్ పది వేల రూపాయలకు పెంచడంతో పాటు వికలాంగుల కమిషన్ ఏర్పాటు చేయాలని వికలాంగుల డిక్లరేషన్ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్, ఎం.అ డివయ్యలు డిమాండ్ చేశారు. శుక్రవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో అక్టోబర్ 9న నిర్వహించే చలో హైదరాబాద్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి ఆర్.వెంకటేష్, ఉపాధ్యక్షులు డి.స్వామి, పి.శశికళ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారావుకు అక్కినేని అంతర్జాతీయ పురస్కారం



కాచిగూడ: అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వర్ రావు శతజయంతి సందర్భంగా ఈ నెల 17వ తేదీన రవీంద్రభారతిలో వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన ఫిలిం ఎనలిటికల్ అండ్ అప్రిసియేషన్ సొసైటీ (ఫాస్) వ్యవస్థాపకులు, సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావుకు అక్కినేని అంతర్జాతీయ పురస్కారం అందించనున్నారని తెలిపారు.

'డబుల్ ఇళ్ల' పంపిణీ పారదర్శకంగా ఉండాలి

అంబర్‌పేట: డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ పారదర్శకంగా పంపిణీ చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌ను బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్ రెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి క్షేత్ర స్థాయి విచారణను పారదర్శకంగా జరిపి అర్హులైన వారికి అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ సజావుగా సాగేలా చూడలన్నారు.

బీఆర్ఎస్ లో చేరిన బీజేపీ నేతలు



అంబర్‌పేట: బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఉంటుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద గోల్నాకకు చెందిన పలువురు బీజేపీ మహిళలు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చంద్రకళ, ఆశలత లతో పలువురు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదల వైద్యానికి నావంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శుక్రవారం గోల్నాకకు చెందిన సీఎచ్ వంశీకి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 34 వేల చెక్కును ఆయన అందించారు.

బీసీ, మహిళా బిల్లులు ఆమోదించాలి

కాచిగూడ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో బీసీ, మహిళా బిల్లులను పెట్టి ఆమోదించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు బిల్లులకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతునిచ్చి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీల ప్రాతినిథ్యం రాజకీయ రంగంలో 15శాతానికి మించడం లేదన్నారు. బీసీ బిల్లు ద్వారా రాజకీయ రంగంలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలన్నారు. కార్యక్రమంలో నల్లెల కిషోర్, పులిజాల కృష్ణ, డాక్టర్ ప్రశాంత్, ముత్యాలరావు, ప్రదీప్ గౌడ్, భూషణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా మంచినీటి పైప్‌లైన్ల ఆధునీకరణ

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: పెరిగిన జనాభాకు అనుగుణంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో అవసరమైన ప్రాంతాలలో మంచినీరు, డ్రైనేజీ పైపులైన్ ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని శివాలయం వీధిలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించుతున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ మ్యాన్‌హోల్ లీకేజీ, కలుషిత నీటి నివారణ, లోప్రెషర్ నీటి సమస్య పరిష్కారానికి సత్వరం కృషి చేస్తున్నామన్నారు. నూతన పైప్‌లైన్ నిర్మాణం ద్వారా స్థానికంగా గత 30 సంత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్య పరిష్కారం కానున్నదని అన్నారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, డివిజన్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.



మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

అన్ని బస్తీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



కాచిగూడ బాలప్పబాడ బస్తీలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం కాచిగూడ డివిజన్ బాలప్పబాడ బస్తీ, భూమన్నలేన్ ప్రాంతాల్లో రూ.43.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పైపులైన్ నిర్మాణపు పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని బస్తీల్లో రూ.కోట్లాది రూపాయలతో ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వసతి, స్ట్రీట్ లైట్స్, కమ్యూనిటీ హాల్స్ తదితర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

సమస్యలపై ఆరా..

కాచిగూడ డివిజన్ పరిధిలోని బాలప్పబాడ, లింగంపల్లి, భూమన్నలేన్, కాచిగూడ స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బందితో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సన్యాసిరావు, ఏఈ భావన, జీహెచ్ఎంసీ ఏఈ విశ్వతేజ పాల్గొన్నారు.

చేపల మార్కెట్ ఆధునీకరణకు చర్యలు

ముషీరాబాద్: నగరంలోనే అతిపెద్దదైన ముషీరాబాద్ చేపల మార్కెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని చేపల మార్కెట్‌లో ఫిష్ కటింగ్ స్థలంలో ఫ్లోరింగ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల మార్కెట్‌కు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి చేపలు దిగుమతి అవుతాయని మార్కెట్‌కు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు టి.సోమన్, నర్సింగ్‌ప్రసాద్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీబీఎస్ఎస్ అధ్యక్ష పదవికి రమణారావు రాజీనామా

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) అధ్యక్ష పదవికి పోచంపల్లి రమణా రావు రాజీనామా చేశారు. అధ్యక్ష హోదాలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమం కోస ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిన తాను కొన్ని అనివార్య కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

చే నంబర్ చౌరస్తాలో వాహనాలకు అనుమతి ఇవ్వండి



చే నంబర్ చౌరస్తాలో వాహనాల అనుమతిపై పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణ పనులతో వాహన దారులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందుల పరిష్కారానికి అధికార యంత్రాంగం ప్రత్యమ్నాయ మార్గం చూపించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. శుక్రవారం చే నంబర్ చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. శ్రీరమణ థియేటర్ చౌరస్తా నుంచి చే నంబర్ వరకు మూసివేసిన రాకపోకలను ఒక వైపు పునరుద్ధరించాలని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. అంబర్‌పేట్‌లో ప్రధాన రాకపోకలకు ఇక్కడి ట్రాఫిక్ మళ్లింపు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. నిర్మాణం పనులు ఒకవైపు చేపట్టి మరోవైపు వాహనాలకు అనుమతించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట నిర్మాణ సంస్థ ప్రతినిధులు, స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

మద్యపానంపై లేని ఆంక్షలు బీడీ పరిశ్రమపై ఎందుకు ?



ధర్నాలో పాల్గొన్న కార్మిక నాయకులు

ముషీరాబాద్: మద్యపానంపై లేని ఆంక్షలు బీడీ పరిశ్రమపై ఎందుకని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, సీఐటీయూ రాష్ట ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. శుక్రవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బీడీ కార్మికుల ఆకలి కేక మహాధర్నాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా హాజరైన నల్లా సూర్యప్రకాష్, పాలడుగు భాస్కర్, బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దండి వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... బీడీ కార్మికులకు, ప్యాకర్లకు, బట్టి, చాటన్, టేకే దారులకు, మునింలకు ఎలాంటి షరతులు లేకుండా ప్రతి ఒక్కరికి రూ. 2016 జీవన భృతి కల్పించాలని డిమాండ్‌చేశారు. బీడీ కార్మికులందరికీ జీవన భృతి రూ.2016 ఇస్తామని ఇచ్చిన హామీ నేటికి అమలు కాలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బహుజన మహిళా సంఘా రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో జాప్యం.. జనాగ్రహం



అర్థాంతరంగా వదిలివేసిన జలమండలి కార్యాలయ రహదారి

సికింద్రాబాద్: పాలకుల జోక్యం, అధికారుల నిర్లక్ష్యంతో రహదారులు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపులు, టెండర్ల ప్రక్రియ పూర్తయినా కేవలం ఆయా ప్రాంతాల్లో నివాసముంటున్న అధికార పార్టీ నాయకుల స్వప్రయోజనాల కోసం నిర్మాణం పనులు వాయిదా వేస్తూ వస్తున్నారు. సీతాఫల్‌మండి డివిజన్ జలమండలి కార్యాలయం మీదుగా టీఆర్‌టీ క్వార్టర్స్ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారి నిర్మాణం కోసం కొద్ది నెలల క్రితమే రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారు. అదే ప్రాంతంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్న గుత్తేదారు వాహనాల కోసం కొన్ని నెలలు, ఇంకొందరు నాయకుల జన్మదిన వేడుకల కోసం మరికొన్ని నెలలు రోడ్డు నిర్మాణం పనులు వాయిదా వేస్తూ వచ్చారు. తీరా నెల రోజుల క్రితం నిర్మాణం కోసం రహదారిని మొత్తంగా తవ్వేశారు. డ్రైనేజీ, తాగు నీటి లైన్ల నిర్మాణం కోసం కొన్ని రోజులు గడిచిపోయాయి. తీరా రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేందుకు ఇదే ప్రాంతంలో ఉండే ఓ నాయకుడి వేడుకల కోసం మరోవారం వాయిదా వేశారు. తిరిగి మళ్లీ నిర్మాణం పనులు చేపట్టే సమయానికి ఇదే కాలనీకి పెద్దలుగా ఉంటున్న ఇరువురు నాయకులు నిర్వహించే గణపతి నవరాత్రి వేడుకల నిమిత్తం రోడ్డు నిర్మాణం పనులు వాయిదా వేస్తున్నట్టు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. టీఆర్‌టీ ప్రాంతంలో నివసించే ఇద్దరు ముగ్గురు నాయకుల స్వప్రయోజనాల కోసమే ప్రభుత్వ అభివృద్ధి పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారని పలువురు టీఆర్‌టీ ప్రాంత వాసులు శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పేరు చెప్పుకుని ఈ ప్రాంతంలోని కొందరు పెద్దలు వేడుకల పేరుతో పెత్తనం నిర్వహించి తమను ఇబ్బందుల పాలు చేయడం ఏంటని ఎమ్మెల్యే కార్యాలయ అధికారులను ప్రశ్నించారు. ప్రమాదకరంగా మారిన టీఆర్‌టీ ప్రాంత రహదారులను సత్వరమే నిర్మించాలని కోరారు.

గణపతి నవరాత్రి ఏర్పాట్లపై అధికారులు నిర్లక్ష్యం: సామ



వంటా వార్పుతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు

చైతన్యపురి: గణపతి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. శుక్రవారం కొత్తపేటలోని జీహెచ్ఎంసీ ఈస్ట్ జోనల్ కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని బీజేపీ కార్పొరేటర్ల ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జోనల్ కమిషనర్ అందుబాటులో లేకపోవటంతో జడ్‌సీ చాంబర్ వద్దే వంటావార్పు నిర్వహించి నిరసన తెలియజేశారు. అనంతరం కార్యాలయంలో సరూర్‌నగర్ డీసీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ, రంజాన్, క్రిస్మస్ పండగలప్పుడు తప్ప అధికారులు గణపతి నవరాత్రులకు స్పందించటం లేదని ఆరోపించారు. కాలనీలలో శానిటేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, రోడ్లు ఊడ్చిన చెత్తను కూడా తొలగించకుండా వదిలేస్తున్నారని ఆరోపించారు. గణేశ్ ఉత్సవాలు త్వరలో ప్రారంభం కాబోతున్నా చెట్ల కొమ్మలు తొలగించలేదని, రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. కనీసం కార్పొరేటర్లు, అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రంగానర్సింహ గుప్తా, వంగా మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణ సురేందర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, నవజీవన్‌రెడ్డి, పవన్‌కుమార్, బీజేపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, జయప్రకాష్, వివేకానందరెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ముషీరాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లో శ్రీ మహంకాళీ దేవాలయ అమ్మవారి ఒడిబియ్యంతో అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముషీరాబాద్ సిఐ జహంగీర్ యాదవ్‌లు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బీసీల మద్దతు బీఆర్ఎస్‌కే..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ బిల్లుతో పాటు మహిళా బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతూ ప్రధానమంత్రికి లేఖరాసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు ఏ.రాజేశ్వర్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన బాగ్‌లింగంపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీసీల మద్దతు బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ భేటీలో కూడా ఈ విషయంపై ముఖ్యమంత్రి ఏకగ్రీవంగా తీర్మానం చేయడం హర్షనీయమన్నారు.

రోడ్లను పరిశుభ్రంగా ఉంచండి

కాచిగూడ: వినాయక చవితి పండుగ సందర్భంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్తను, మట్టికుప్పలను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని బీఆర్ఎస్ నేత, కార్పొరేటర్ భర్త దూసరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం గోల్నాక డివిజన్ వరంగల్ జాతీయ రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన మట్టికుప్పలను, చెత్తను జీహెచ్ఎంసీ సిబ్బంది కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు తొలగించారు.

వీసీ తీరును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.రవీందర్ వివిధ అంశాలపై అనుసరిస్తున్న తీరు పట్ల అధ్యాపకులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. శుక్రవారం క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీలో జరిగిన ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) సర్వసభ్య సమావేశంలో వీసీ విధానాలను తూర్పారాబట్టారు. కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్), పీఆర్‌సీ బకాయిలు, ఇటీవల జరిగిన సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అవకతవకలు, ఓయూ భూముల కబ్జా తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ప్రవేశ పెట్టిన తీర్మానాలను అధ్యాపకులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆందోళన ద్వారా వీసీ ప్రొ.రవీందర్ నియంతృత్వ ధోరణులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఔటా నాయకులు డాక్టర్ గంగాధర్, రాధాకృష్ణతో పాటు సీనియర్ ప్రొఫెసర్లు కిషన్, అప్పారావు పాల్గొన్నారు.

హైటెన్షన్ తీగల మార్పునకు కృషి



లాలాపేట: తార్నాక స్ట్రీట్ నెంబర్ 10, 11 జనవాసాల్లో ఉన్న విద్యుత్ హై టెన్షన్ వైర్లను శుక్రవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి పరిశీలించారు. ఇళ్లపై నుంచి వెళ్తున్న 33కేవీ తీగలతో తలెత్తుతున్న సమస్యలపై స్థానికులు డిప్యూటీ మేయర్‌కు దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ అధికారులతో చర్చించి హై టెన్షన్ వైర్ల మార్పుపై చర్చించారు. ఈ సమస్యను మంత్రి జగదీశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని స్థానికులకు డిప్యూటీ మేయర్ హామీ ఇచ్చారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్టించండి



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రకృతిని ప్రేమించడంతో పాటు మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించాలని అప్పుడే పర్యావరణాన్ని కాపాడినట్లు అవుతుందని జీహెచ్ఎంసీ సర్కిల్-15 డిప్యూటీ కమీషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. శుక్రవారం సుందరయ్య పార్కులో హైదరాబాద్ జిందాబాద్, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ తిప్పర్తి యాదయ్య మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి హెచ్ఎండిఏ జీహెచ్ఎంసీ మట్టి వినాయక ప్రిగహాలను పంపిణీ చేస్తూ పర్యావరణాన్ని కాపాడడానికి కృషి చేస్తుందని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్.రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వి. నిరంజన్‌రెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మురళీకృష్ణ, హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య, పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల పాదయాత్ర



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ నిర్వహిస్తున్న పాదయాత్ర దృశ్యం

ముషీరాబాద్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న తుక్కుగుడలో జరిగే కాంగ్రెస్ పార్టీ విజయభేరి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని అచ్చుతరెడ్డి మార్గ్, విద్యానగర్, సాయిచరణ్ కాలనీ, నాగమయ్యకుంట తదితర ప్రాంతాలలో ఆత్మీయ ప్రజా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సాకారం చేయడం కోసం సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసి భవిష్యత్తుకు బాటలు వేశారని అయితే రాష్ట్రంలో రాక్షస కుటుంబ పాలన నడుస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వై.శ్రీనివాస్, రాజు, వర్మ, వరదరాజు, నాగసాయి, ఆనంద్, రాములు, పర్వతాలు, ఉదయ్, మహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పీవీ సేవలను విస్మరించొద్దు

నల్లకుంట: మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు దేశానికి అందించిన సేవలను అన్ని రాజకీయ పార్టీలు విస్మరిస్తున్నాయని తెలంగాణ బ్రాహ్మణ ఎంప్లాయీస్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(టీబీఈపీడబ్ల్యూఏ) అధ్యక్షుడు అన్నావజుల సూర్యప్రకాష్ విమర్శించారు. పీవీ సేవలను విస్మరిస్తే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి రాజకీయ భవిష్యత్తు ఉండదన్నారు. శుక్రవారం నల్లకుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో అట్టహాసంగా సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహిస్తున్న తెలంగాణ కాంగ్రెస్ నాయకులు దివంగత పీవీని మరిచిపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పీవీని మరచిపోవడం అంటే భారత దేశ కీర్తి ప్రతిష్టలను అగౌరవ పరచడమేనని ఆయన పేర్కొన్నారు.

చేతి వృత్తిదారులకు ప్రధాని విశ్వకర్మ యోజన పథకం

ముషీరాబాద్: విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ విశ్వకర్మ యోజన అనే కొత్త పథకాన్ని ప్రారంభించడం వలన 15 రకాల చేతి వృత్తుల వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు పేర్కొన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. దేశవ్యాప్తంగా ఉన్న 30 లక్షల మందికి 13 వేల కోట్ల నిధులను కేటాయిస్తున్నారని తెలిపారు. ఐదు శాతం రాయితీ వడ్డీతో మూడు లక్షల రుణాలను మంజూరు చేస్తున్నామని ఆధునిక పనిముట్ల కొనుగోలుకు 15 వేల రూపాయల ఆర్థిక సహాయం ఈ పథకం ద్వారా పొందవచ్చన్నారు.

సమాజాభివృద్ధి లో ఇంజినీర్ల పాత్ర కీలకం



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉన్నతాధికారులు

సికింద్రాబాద్: నవ సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని పలువురు రైల్వే ఉన్నత అధికారులు పేర్కొన్నారు. గడచిన దశాబ్దకాలంగా ఇంజినీర్ల కృషి ఫలితంగానే దేశం పురోభివృద్ధి సాధించిందని కొనియాడారు. శుక్రవారం నార్త్‌లాలాగూడలోని జోనల్ ఇంజినీర్ల శిక్షణ కేంద్రం ఆడిటోరియంలో నిర్వహించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకల్లో రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ రామకృష్ణ, ఎలక్ట్రికల్ చీఫ్ ఇంజినీర్ పీడీ మిశ్రా, డిస్ట్రిబ్యూషన్ చీఫ్ ఇంజినీర్ సీహెచ్ఎస్ రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్‌చీఫ్ నల్ల వేంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిన ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణంలో ఇంజినీర్ల కృషిని సభలో ప్రస్తావించారు. హైదరాబాద్ నగరాన్ని వరదల బారి నుంచి రక్షించడం కోసం మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ద.మ రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీకొండ పద్మనాభం, ప్రధానకార్యదర్శి వై.లోకేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ చెరువు కట్టను పరిశీలించిన పోలీసు అధికారులు



సైదాబాద్: గణేశ్ నవరాత్రులు, సామూహిక గణేశ్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా సరూర్‌నగర్ చెరువు కట్టను హైదరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. శుక్రవారం చెరువు కట్ట వద్దకు నగర అడిషనల్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్ చేరుకున్నారు. నిమజ్జనం సందర్భంగా చెరువు కట్టపై చేపట్టే ఏర్పాట్లను తెలుసుకున్నారు. సామూహిక గణేష్ నిమజ్జనానికి పాతబస్తీ నుంచి ఐఎస్‌సదన్ చౌరస్తా, సైదాబాద్‌లోని డీసీపీ కార్యాలయం చౌరస్తా మీదుగా చెరువు కట్టకు, దిల్‌సుఖ్‌నగర్ జాతీయ రహదారి నుంచి శివగంగా థియేటర్ మార్గం మీదుగా సరూర్‌నగర్ చెరువు కట్టకు గణేష్ విగ్రహాల వాహనాలు చేరుకుంటాయి. తదితర వివరాలు తెలుసుకున్న అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేసారు. కార్యక్రమంలో సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ మనోహర్, సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్, మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రవి మొలుగూరి, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.